క్లుప్తంగా

పాఠశాలలకు పౌష్టికాహారం పంపిణీ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం నిర్వాహకుడు అర్జున్ పాఠశాలల హెచ్‌ఎంలకు రాగిపిండి, బెల్లం తదితర పౌష్టికాహారం పంపిణీ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థులకు వాటిని పంపిణీ చేయాలని సూచించారు. మంగళ, గురు, శనివారాల్లో వీటితో రాగిమాల్టు తయారు చేసి భోజనానికి ముందు విద్యార్థులకు అందించాలన్నారు. మిగతా మూడు రోజుల్లో ఆకుకూరలు, పప్పు, గుడ్డు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుధారాణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



పెబ్బేరు రూరల్: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా మంగళవారం చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని తిరుమల కాలనీలో పలు డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మి, సంఘ సభ్యులు నిర్మల, వసంత, నందిని, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లిలో రైతు కృపాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో గొర్రెల కాపరి మధు గొర్రెలను మేపుతూ పక్కనే ఉన్న షెడ్ వద్ద సేదతీరుతున్నాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో గదిని తెరిచి చూడగా అందులో ఉన్న ఫ్రిజ్ కింద పడుకొని ఉన్న కొండశిలువ గుర్తించాడు. వెంటనే అతడు వనపర్తి హోంగార్డు కృష్ణసాగర్‌కు ఫోను ద్వారా సమాచారం ఇచ్చాడు. స్పందించిన ఆయన వెంటనే తోమాలపల్లికి చేరుకొని అక్కడ ఉన్న కొండచిలువను బంధించి తీసుకెళ్లాడు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయులను అనుకరిస్తూ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా అక్షిత, డీఈఓగా శైలజ, ఎంఈఓగా రిత్విక వ్యవహరించగా మరో 36 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారని సోళీపురం కాంప్లెక్స్ హెచ్‌ఎం జయశంకర్ తెలిపారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులను గుర్తించి అభినందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ రాములు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

అమరచింత: కొంకన్‌వానిపల్లిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఎం మండల నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైనందున తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధిలైట్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ భవనం ముందున్న హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చెపట్టి వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొగిలన్న, వెంకటేష్, శ్రీకాంత్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తిలో మంగళవారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవాసమతి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత చదవడం ద్వారా కలిగే బోధ, శివరాత్రి పండుగ విశిష్టతపై గ్రామంలో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానసేవాసమితి వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, సురేష్ కుమార్, కృష్ణయ్య, నాగరత్నం, లలిత, బద్రీనారాయణ, స్వరూప, బాలయ్య, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పల్స్ పోలియో'



పెబ్బేరు బస్టాండులో పోలియో చుక్కల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం మంగళవారంతో ముగిసినట్లు సీహెచ్‌ఓ రామయ్య, మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు తెలిపారు. మూడు రోజుల్లో మొదటి రోజు ప్రత్యేక కేంద్రాల ద్వారా, మిగిలిన రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరుగుతూ వంద శాతం పూర్తి చేసినట్లు వారు పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 4,237 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని గ్రామాల్లో మంగళవారం మండల వైద్య బృందాలు ఇంటింటికీ తిరుగుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు చేశారు. పెబ్బేరు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి డాక్టర్ పరిమళ పోలియో చుక్కల కేంద్రాని తనిఖీ చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ సూపర్‌వైజర్ అశోక్, చంద్రయ్య, నరసింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ధ్యానంతో జ్ఞానం పెరుగుతుంది'



మౌన ధ్యానం చేస్తున్న మహిళలు

పెబ్బేరు రూరల్: పిరమిడ్‌సొసైటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని వర్తక సంఘం అసోసియేషన్ భవనంలో మంగళవారం ఉదయం మౌనధ్యానం నిర్వహించినట్లు పిరమిడ్ సొసైటీ పట్టణ అధ్యక్షుడు ఓమేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా కమిటీ సమన్వయ సభ్యుడు డాక్టర్ రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. మౌన ధ్యానం ద్వారా మనలో నెగిటివ్ ఆలోచనలు తొలిగి మనసు ప్రశాంతం అవడంతో పనిపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. మౌనం వలన ధ్యానం, ధ్యానం వల్ల జ్ఞానం కలుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అందరికీ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీనియర్ మాస్టర్లు సునీత, కమలమ్మ, సుగుణమ్మ, మహేశ్వరి, రాములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో మంగళవారం ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల అకౌంట్ లాక్ కావడంతో గతేడాది చేసిన కూలి డబ్బులు రాకుండా పోయాయని వాపోయారు. పని ప్రదేశంలో టెంటు సౌకర్యం లేదని, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో లేదని, ప్రతి రోజు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కూలిల డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి కేవలం రూ.66 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం అంటే ఉపాధిని నిర్వీర్యం చేయడంలో ఒక భాగమని ఆరోపించారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కూలి రూ.600 ఇవ్వడంతో పాటు ఏడాదికి 200 వందల రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, మొగిలన్న, రాజు పాల్గొన్నారు.

ట్రస్ట్ నిర్మాణానికి అనుమతి ఇవ్వండి

అమరచింత: పట్టణంలో జీ.శ్రీనివాస్ ట్రస్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలంటూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ నూరుల్ నదీం, తహసీల్దార్ షేక్ చాంద్‌పాషాలను ట్రస్ట్ కార్యదర్శి జీఎస్ గోపి వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో ట్రస్ట్ కోసం గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ద్వారా అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కావాలని కొంతమంది సీపీఎంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తమ స్వచ్ఛంద సంస్థకు చెందిన స్థలంలో నిర్మాణంపై అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆర్ ఎస్.రమేష్, అజయ్, అనంతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎడ్ పరీక్షలను వాయిదా వేయాలి

పాన్‌గల్: ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించే బీఈడీ పరీక్షలను వాయిదా వేయాలని ప్రజా సమస్య పోరాట రాష్ట్ర అధ్యక్షుడు చిక్కోండ్ల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పాలమూరు యూనివర్సిటీ బీఈడీ సిలబస్ మారినందు వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మారిన సిలబస్‌కు సంబంధించిన టెస్ట్ పేపర్స్ మార్కెటులోకి ఇంకా రానందున పరీక్షలను వాయిదా వేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పామాపురం గ్రామానికి చెందిన సయ్యద్ రసూల్ రెండో కుమార్తె కతీజాబేగం(19) 8వ తరగతి వరకు చదివి మధ్యలోనే ఆపేసింది. దీంతో వారి వద్ద ఉన్న బర్రెలను మేతకు తీసుకెళ్లేందుకు అప్పుడప్పుడు వెళ్తుండేది. సోమవారం బర్రెలను మేతకు తీసుకెళ్లిన కతీజాబేగం సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. గ్రామ శివారులో, బంధువుల వద్ద వెతికినా సమాచారం దొరకలేదు. సెల్ ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ ఉండటంతో ఆందోళన చెంది మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రావుల సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని, కొత్త, పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, వచ్చే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రెడ్డి, డీలర్ నాగేశ్వర్‌రెడ్డి, మద్దెల వెంకటన్న, బాబురెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, కట్టెల వెంకట్‌రెడ్డి, శాంతన్న, మద్దెల రాములు, బండెన్న, సంజీవరెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత ఆరోపణలు.. ఆలయాల్లో ప్రమాణాలు

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

వనపర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గీయులైన ఇద్దరి నాయకుల మధ్య వ్యక్తిగత ఆరోపణలు సోషల్ మీడియా వేదికగా తారాస్థాయికి చేరాయి. వివరాల్లోకి వెళ్తే కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశాడని కాంగ్రెస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ స్పందిస్తూ ఆయనపై కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆలయాల్లో ప్రమాణం చేయాలని ఒకరికొకరు సవాల్ విసురుకున్నారు. దీంతో కిరణ్ రాజా గారి బంగ్లా వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో తడి బట్టలతో ప్రమాణం చేయగా.. శ్రీనివాస్‌గౌడ్ చింతల హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేసిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియా వేదిక వీరి గొడవను తెలుసుకున్న పోలీసులు రంగంలోకి ఇద్దరితో మాట్లాడి సమస్య సద్దుమనిగేలా చేశారు.

నేడు చిన్నారెడ్డి రాక

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లెల చిన్నారెడ్డి తొలిసారిగా వనపర్తి నియోజకవర్గానికి బుధవారం రానున్నారు. మొదట గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బుద్దారం, గోపాల్‌పేట, తాడిపర్తి మీదుగా జిల్లా కేంద్రంలోని అన్ని కాలనీలను పర్యటించేలా భారీ ర్యాలీకి చిన్నారెడ్డి వర్గీయులు ఏర్పాట్లు చేశారు. ర్యాలీ అనంతరం నాగవరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నారు.

ఒండ్రుమట్టి తరలింపునకు వెసులుబాటు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని చెరువుల్లో ఒండ్రుమట్టిని కూలీలు కట్టకు వేస్తున్నారని, రైతులు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టిని పొలాల్లో వేసుకునే వెసులుబాటు ఉందని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటపొలాలకు ఒండ్రుమట్టిని తరలించుకునేందుకు మంచి అవకాశం అన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం లేవలింగ్, కంపచెట్ల తొలిగింపు, చెరువుల్లో ఒండ్రుమట్టి తీయుట తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీఏ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బీ పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివమాలధారులు

వనపర్తి టౌన్: శివ మాలధారులు మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచి రామలింగేశ్వరస్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాష్టకం, శివ నామస్మరణతో భజనలు చేస్తూ శరణగోషతో శివారాధన చేశారు. ఈ సందర్భంగా మాలధారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రాకతో ఆలయ ప్రాంతాలు కిటకిటలాడింది. గురు స్వాములు మాలధారులకు ఇరుముడి కట్టే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలోని శివాలయంలో శివ మాలధారులు మంగళవారం ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరనతో మార్మోగింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



రాంపురంలో..



వనపర్తిలో..

మామిడి తోటలకు సాగునీరు అందివ్వాలి



వీపనగండ్ల: మండలంలో మామిడి తోటలు సాగు చేసుకున్న రైతులకు నీరు లేక తోటలు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా తోటలను కాపాడుకునే చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్వరాలలో రైతుసంఘానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌లో నీటి శాతం తగ్గిపోతుండడంతో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి నెలకొంటుందని, రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి జూరాలకు నీటిని విడుదల చేయించాలని కోరారు. అన్నదాతల హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఢిల్లీ సరిహద్దు రాష్ట్రాల రైతులపై కేంద్రప్రభుత్వం దాడులు నిర్వహించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనలో చనిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు సత్యం, రైతు సంఘం నాయకులు రామస్వామి, వెంకటయ్య, నిరంజన్, కృష్ణయ్య, నరేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు సంత స్థలాన్ని కాపాడాలి



మంత్రి జూపల్లితో మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ కుమారుడి వివాహానికి హాజరైన ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులతో పెబ్బేరు సంత వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంత స్థల విషయంపై మంత్రి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో ఇచ్చిన ఓఆర్సీ రద్దు చేసి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిని సమన్వయం చేస్తూ 30 ఎకరాల స్థలాన్ని సంత వినియోగానికే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో ప్రజలు, వ్యాపారస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు గంధం రాజశేఖర్, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌శెట్టి, రాములు, సత్యనారాయణ, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

మదనాపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లపైన విద్యుత్ వినియోగించిన వారికి అదనపు యూనిట్లకు మాత్రమే చార్జ్ వేయాలన్నారు. రేషన్ కార్డు అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ గృహ జ్యోతి పథకం కింద కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాల్లో పోటీ చేస్తున్నప్పటికీ కనీస 200 సీట్లు కూడా రానివ్వకుండా ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్రాములు, మొగిలి, ప్రసాద్, విష్ణు, మసన్న, చిరంజీవి, వెంకటేష్, చెన్నయ్య వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పుస్తకాల పంపిణీ

వీపనగండ్ల: 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమంగా రాణించాలన్న ఉద్దేశ్యంతో 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన క్వచ్చన్ బ్యాంక్ గైడ్స్ నిలిచిపోయాయి. మండలంలో 8 ఉన్నత పాఠశాలలో 174 మంది విద్యార్థులు 10 వ తరగతి వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంది. విద్యార్థులకు ఏడాది కాలంగా ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు సంక్షిప్తంగా తయారు చేసి తక్కువ వ్యవధిలో ఉన్నత ఫలితాల కోసం విద్యార్థులకు అందజేయాల్సిన పుస్తకాలను ఎమ్మెల్సీ ఎన్నికలను కారణంగా చూపుతూ నిలిపివేయడం అన్యాయం అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండల రిసోర్స్ సెంటర్‌లో ఉన్న ఈ పుస్తకాలను రాజకీయాలకు అతీతంగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంఈఓ లక్ష్మన్‌నాయక్‌ను వివరణ కోరగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కోసం ఎంఈఓ కార్యాలయానికి పుస్తకాలు వచ్చిన మాట వాస్తవమే. కానీ జిల్లా అధికారులు ఆదేశిస్తే పుస్తకాలను పంపిణీ చేస్తామని అన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పాన్‌గల్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలు పెంచేలా బోధన సాగించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వాటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకరావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మల్లాపురంలో కేంద్ర మాజీ మంత్రి పూజలు



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ఆత్మకూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కుమారుడు కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మంగళవారం ఆత్మకూర్ శివారులోని మల్లాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహబూబ్‌నగర్, కర్నూల్‌కు మంచి సంబంధాలు ఉన్నాయని వాటి అందరూ కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటశేషశర్మ, కోట్ల రాఘవేందర్‌రెడ్డి, సోంసాగర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, గంగ, సాయిరాఘవ, వెంకటన్న, అజ్మతుల్లా, షంషీర్, కర్నూలుకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు



ఆత్మకూర్: ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జూరాల క్రాస్ రోడ్డు వద్ద ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా తాగి వాహనం నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాలరాజు, యుగేందర్, నర్సమ్మ ఉన్నారు.

ఆత్మకూర్ కవయిత్రికి సాహిత్య పురస్కారం



ఆత్మకూర్: వేయి వెలుగుల తెలుగు వెలుగు అంతర్జాతీయ అంతర్జాల కవితా పోటీల్లో ఆత్మకూర్‌కు చెందిన కవయిత్రి బండారు సునీతకు తెలుగు వెలుగు సాహిత్య పురస్కారం లభించింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న బండారు సునీత హైదరాబాద్‌లో జరిగిన తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవిత పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కవితా పోటీల్లో జాతీయస్థాయిలో సాహిత్య సేవా పురస్కారం ఆత్మకూర్ వాసికి రావడం అభినందనీయమని జీహెచ్‌ఎం కొండాపురం బాలరాజు అన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఆయాపార్టీలకు చెందిన నాయకులు బండారు సునీతను అభినందించారు.